తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మంచినీటి బిల్లులకై వైకాపా నేతల నిరసన

శాంతిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన మంచినీటి బిల్లులు మంజూరు చేయాలని శాంతిపురంలో శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలాలకు చెందిన నీటిని సరఫరా చేసిన వైకాపా నేతలు, కార్యకర్తలు పలువురు నిరసన తెలిపారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూసినందుకు బిల్లులు మంజూరు చేయడం లేదా అని ప్రశ్నించారు. తమ పరిస్థితి దారుణంగా ఉందని కొందరు ఫైనాన్స్ ఇచ్చిన వారు ట్రాక్టర్లు తీసుకెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మందు ఎలాంటి కార్యాచరణ అమలు చేయాల్లో చర్చించారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు దగ్ధం

**- తప్పిన పెనుప్రమాదం - సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు**



గూడూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

వెంకటగిరి నుంచి గూడూరు వైపు వస్తున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన గూడూరు మండలం తిప్పవరపాడు జంక్షన్‌లో జరిగింది. ఈ సంఘటనను అక్కడే ఉన్న స్థానికులు గమనించి అందులో ఉన్న నలుగురు వ్యక్తులను కారు అద్దాలు పగులగొట్టి బయటికి తీశారు. సురక్షితంగా వ్యక్తులను కాపాడారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ వాహనం అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కారులో ఉన్న వ్యక్తులు హిందీలో మాట్లాడుతుండగా, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారని తెలుస్తోంది.

**ఎన్నిసార్లు ఎన్నికల విధులు నిర్వర్తించినా**

## మళ్లీ కొత్తగా విధులు నిర్వహణ

**- కలెక్టర్ సగిలి షన్మోహన్**



ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సగిలి షన్మోహన్.

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త: గతంలో పలుమార్లు ఎన్నికల విధులు నిర్వర్తించినా ఎన్నికల విధులు మళ్ళీ నిర్వర్తించాలంటే కొత్తగా వుంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో బుధవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్‌లతో కలిసి 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, మున్సిపల్ కమీషనర్లు, నోడల్ ఆఫీసర్లు, ఎంపిడిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, నంద్యాల జిల్లాల నుండి వచ్చిన ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు గతంలో ఎన్నిసార్లు ఎన్నికల విధులు నిర్వర్తించినప్పటికీ మళ్ళీ ఎన్నికల విధులు కొత్తగా వుంటాయని, ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. 18-21 సంవత్సరాల యువతీయువకులు కొత్తగా ఫారం-6 ద్వారా ఓటరు నమోదుకు ఇచ్చినపుడు ఫారం-6తో పాటు ఆధార్, స్కూల్ సర్టిఫికేట్, బర్త్ సర్టిఫికేట్‌లను తీసుకోవాలన్నారు. ఫారం-7 తీసివేయడం, మైగ్రేషన్ తీసుకోరాదని, మృతి చెందిన వాటికి సంబంధించిన వాటిని మాత్రమే తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో వున్న డెత్ సర్టిఫికేట్లను పరిశీలించాలన్నారు. న్యూస్ పేపర్లలో వచ్చిన వాటికి సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత ఎఇఆర్ఓల నుండి తెప్పించుకోవాలని, రాజకీయ పార్టీల నాయకులు అందించిన ఫిర్యాదులను ఎలక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ తీసుకొని పరిశీలించాలన్నారు. ప్రతివారం ఎఇఆర్ఓలు ఆ వారంలో 6, 7, 8 ఫారంలకు సంబంధించి రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి వారికి తెలియజేయాలన్నారు. ఏడు నియోజకవర్గాలకు సంబందించిన ఆర్ఓలు, ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, నోడల్ ఆఫీ సర్లు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## రసకందాయం శ్రీకాళహస్తి 'రాజకీయం'

**ఆశావహుల్లో ఉత్కంఠత: కార్యకర్తల్లో అయోమయం**

శ్రీకాళహస్తి, ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయం రసకందాయంగా మారింది. పార్టీ టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో ఉత్కంఠత చోటు చేసుకోగా కార్యకర్తల్లో ఆయోమయం పరిస్థితి చోటు చేసుకుంది. ఇటు తెలుగుదేశం, అటు వైకాపా ఇంకా తమ అభ్యర్థుల్ని ప్రకటించలేదు. అధికార తెలుగుదేశం పార్టీలో టిక్కెట్టు ఆశిస్తున్న వారిలో బొజ్జల కుటుంబానికి, మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు మధ్య పోరు సాగుతుంది. ఇప్పటికే రాజధానిలో ఇరువురు తిష్ట వేసి కమిటిల వద్దకు వెళ్ళి తమ వాదల్ని వినిపిస్తున్నారు. అయితే బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం స్పీడుగా ప్రచారాల్లో మునిగి తేలుతున్నారు. పార్టీ సమావేశాలు, కార్యకర్తలతో భేటీ సమావేశాలు ఏర్పాటు చేసుకొని ముందుకు వెళుతున్నారు. అయితే కీలకమైన ఈ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు కేటాయింపు అధిష్టానానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. సిఎం సొంత జిల్లా చిత్తూరులో గత ఎన్నికల్లో పెద్దిరెడ్డి ధాటికి తట్టుకోలేక పోయారు. వైకాపా క్లీన్‌స్వీప్ చేసారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మూడు స్థానాలు తూర్పు మండలాల్లో ఉన్నాయి. తిరుపతి సత్యవేడు, శ్రీకాళహస్తి స్థానాలున్నాయి. గతంలో ముఖాముఖీ పోటీ అయితే ఈ సారి నలుగురు అభ్యర్థులు రంగంలో ఉంటారు. వివిధ సమీకరణలతో ఓట్లు చీలిపోయే పరిస్థితి చోటు చేసుకుంది. కాబట్టి ఒక్క సీటు కూడా తెలుగుదేశం పార్టీకి ఎంతో అవసరం. శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం టిక్కెట్టు తనకే అనే ధీమాలో బొజ్జల సుధీర్‌రెడ్డి ఉండగా, మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు తనకు అన్ని వర్గాల నుంచి మద్దతు ఉందని గెలుపు అభ్యర్థులకే అవకాశం కల్పించాలని ఆశిస్తున్నారు. గతంలో పార్టీలో ఉన్నా తాము ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ అధినాయకుని ఆదేశాల్ని అమలు చేశాము కాబట్టి పార్టీ భవిష్యత్తు దృష్ట్యా నిర్ణయం తీసుకోవాలని ఎస్‌సివి నాయుడు కోరుతున్నట్లు సమాచారం. తాము గతంలో ఓ సారి ఓడిపోయానని అంతేకాక తన తండ్రికి చంద్రబాబునాయుడు మాటిచ్చారు కాబట్టి తమకు అవకాశం కల్పించాలని బొజ్జల సుధీర్‌రెడ్డి కోరుతున్నారు. పార్టీ టిక్కెట్టుకు సంబంధించి తెలుగుదేశం పార్టీ సర్వేలు జరుపుకుంది. తన వ్యక్తిగత సర్వేలు, నివేదికలు సేకరించుకుంది. అయితే ఎవరికి అవకాశం కల్పించాలనే సందిగ్దంలో ఉన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఇటు అధికార అటు ప్రతిపక్ష పార్టీల్లో టిక్కెట్ల లొల్లి చోటు చేసుకుంది. ఇక రెండు పార్టీల్లోనూ పార్టీ అధినాయకులు ఎవరికి ఏమి హామీ ఇచ్చారో ఏమో కానీ రాజధాని నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి తమకు టిక్కెట్టు కన్‌ఫార్మ్ అని సంకేతాలు ఇచ్చారని ఆయన అనుచరులు కుటుంబసభ్యులు భారీ ఎత్తున ప్రచారాల్లో తలమునకలై ఉన్నారు. సర్వేలు, జనాభిప్రాయం ఎవరికి అనుకూలంగా ఉంటే వారికే టిక్కెట్లు అని చంద్రబాబునాయుడు చెబుతున్నా అధికారికంగా అభ్యర్థి ఎవరో ప్రకటించలేదు. అయితే ఇక అధికార వైకాపా నాయకుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఐదేళ్ళ పాటు అందించిన సేవల్ని, సహాయసహాకారాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజలతో మమేకమై ఉన్న తనకు పార్టీ టిక్కెట్టుపై ప్రతిపక్షం లొల్లిచేయటం పట్ల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట, తొట్టంబేడు మండలాలు తమ తనయ గుప్పిట్లో ఉంచుకొని ముందుకు సాగుతున్నారు. ఇక ఏర్పేడులో తన బంధువు, శ్రీకాళహస్తి రూరల్, అర్బన్‌లలో ఎన్నికల ముందు చక్రం తిప్పవచ్చుననే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. పది మందికి టిక్కెట్లు ఇప్పించే స్థితిలో ఉన్న తనకు టిక్కెట్టుపై ప్రతిపక్షం లొల్లి చేయటం హాస్యాస్పదమని శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి తనదైన ధోరణిలో ముందుకు వెళుతున్నారు. ఇలా నియోజకవర్గంలో సందడి చోటు చేసుకుంది.



శ్రీకాళహస్తి పట్టణం

**గాంధీ సర్కిల్ ఆవరణలో**

## భారీ ఇవిఎం సమూనా

**- ఇవిఎంల వినియోగంపై అవగాహన**

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓటర్లను ఓటింగ్ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించడానికి శ్రీకారం చుట్టారు. చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై ఓటర్లకు విస్తృతంగా అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు భారీ ఇవిఎం నమూనా ఏర్పాటు చేశారు. అలాగే కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. గాంధీ విగ్రహం కూడలిలో ఏర్పాటు చేసిన భారీ ఇవిఎం నమూనా అందరినీ అకట్టుకొంటోంది. ఇవిఎంలో ఓటింగ్ విధానంపై ఈ నమూనా ఆధారంగా ఓటర్లకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఇవిఎంలో ఓటు వేసిన సందర్భంలో ఎవరికి ఓటు వేశామో వారి పేరు ఎదురుగా లైట్ వెలిగేలా ఏర్పాట్లు చేశారు. ఇవిఎం పనిచేసే విధానంపై ఓటర్లకు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తున్నారు.

## పలమనేరు వైకాపా అభ్యర్థిగా శ్రీనివాసులు(వాసు)...!



పలమనేరు, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త: పలమనేరు వైకాపా అభ్యర్థిగా చిత్తూరు జెడ్పీ చైర్మన్ గోవింద రాజు లు శ్రీనివాసులు(వాసు)పేరు బలంగా వినిపిస్తుంది. అధిష్టానం ఆజ్ఞాపిస్తే వైకాపా అభ్యర్థిగా పోటీకి సిద్ధం అంటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు వైకాపా 6 విడతలుగా అభ్యర్థులను ఖరారు చేసినప్పటికి అందులో పల మనేరు అభ్యర్థి పేరు ఖరారు కాకపోవడంతో పలమనేరు అభ్య ర్థి మార్పు ఉంటుందన్న అంశం పలమనేరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో బుధవారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అధిష్టానం పలమనేరు అభ్యర్థిగా పోటీ చేయమంటే నేను సిద్ధమని ప్రకటించారు. దీంతో పలమనేరు రాజకీయాలంలో మరింత వేడి మొదలైంది. ఇప్పటి వరకు అభ్యర్థి ఖరారు కాకపోవడంతో అటు వైకాపా నాయకులు, ఇటు ప్రజలలో అభ్యర్థి ఎవరన్న విషయాలపై అనేక ఊహాగానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో జెడ్పీ చైర్మన్ వ్యాఖ్యలతో వైకాపాలో అభ్యర్థి మార్పు ఖయమంటు పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జెడ్పీ చైర్మన్ ఆయనకు పలమనేరు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని ఈ మేరకు ఇప్పటికే నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు మద్దతుగా ఉనట్లు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఈ నెల 5న ప్రభాతవార్తలో" తేలని పలమనేరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం" అన్న కథనం ప్రచురితం అయిన విషయం విధితమే. అయితే ఇప్పటి వరకు ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా దీనిపై స్పందించకపోవడంతో జెడ్పీ వ్యాఖలకు మరింతబలంచేకూరుతుంది.

## ఉపాధి హామీలో అవినీతి జలగలు!

**పని చేసేది కేవలం 9మంది మాత్రమే....బిల్లు పెట్టేది 41 మందికి**

**తిరుపతిరూరల్ ఉపాధి హామీలో అంతా అభూత కల్పనే**







తిరుపతి-ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో పెద్దఎత్తున గోల్‌మాల్ జరుగుతుంది. దామినేడు చెరువులో కేవలం 9మంది కూలీల చేతనే పని చేయిస్తూ...ఒక ఫోటోనే బర్పింగ్ చేస్తూ...7 రకాల ఫోటోలుగా విభజించి, 41 మంది పనికి ఆహార పథకానికి పనిచేస్తూన్నట్లుగా క్రియేటివిటి చేస్తూ...41మందికి బిల్లు పెట్టి వసూలు చేస్తున్న ఘటన దామినేడులో జరుగుతుంది. ఫీల్డ్ అసిస్టెంట్ చేస్తున్న మాయాజాలం కళ్లకు కట్టినట్లు కనబడుతున్న ఉపాధిహామీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం వెనక అంతర్యం అర్థం కావడం లేదు. కేవలం 9మంది మాత్రమే పని చేస్తూ...41 మందికి గత వారం రోజులుగా బిల్లు పెట్టడం ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ధైర్య సహాసాలకు ఏవరైన సలాం కొట్టాల్సిందే. ఈ వారంలో 14మంది పని చేస్తూ, 76 మందికి బిల్లు పెట్టి వసూలు చేసిన ఆమె ధైర్యసహాసాలకు సలం కొట్టాల్సిందే. ఎపిఓ అండదండలతోనే ఆ ఫీల్డ్ అసిస్టెంట్ దుస్సాహసానికి పూనుకున్నట్లు సమాచారం. సాయినగర్‌కు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తిరుచానూరు ఫీల్డ్ అసిస్టెంట్ చలామణి అవుతూ...అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెల్సిందే. ఉపాధిహామీ అవినీతిలో క్షేత్రస్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు ముడుపులు చెల్లిస్తున్నామనే ధీమాతోనే ఫీల్డ్ అసిస్టెంట్ గ్రాఫిక్ మాయాజాలంతో ముందుకు వెళ్ళుతుంది. గతంలో అవినీతికి పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్ చలపతి బదిలీపై వెళ్ళిన విషయం తెల్సిందే. దామినేడు చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులలో కేవలం 12 మాత్రమే కూలీలు పనిచేస్తుండా ...10 మస్టర్స్‌గా లెక్కలు చూపి, 76 మంది ఉపాధి కూలీలుగా పని చేస్తున్నట్లు బిల్లులు పెడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ లబ్ది పొందుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరి కూడా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతికి అండగా ఉండారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో చేసిన పనినే మరల మరల చేస్తూ, చేయిస్తూ...చేసిన పనికే పదేపదే కొలతలు చూపి...బిల్లులు పెట్టి...డబ్బులు వసూలు చేస్తూ... ప్రభుత్వ ఖజానాకు గండికొడుతన్నారు. తిరుపతిరూరల్ మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాల్సి ఉంది.

**తెదేపా అభ్యర్థుల ఎంపికలో**

## 'ఐవిఆర్' విధానం

**ఫోన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ..**

**కుప్పంలో సైతం చంద్రబాబు అభ్యర్థిత్వంపై ఇదే పద్ధతి !!**



కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయదలచుకున్న అభ్యర్థుల ఎంపికకై తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇంటర్ యాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ (ఐవిఆర్) విధానంను అమలు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న అభ్యర్థుల్లో ప్రజలు ఎవరికి అధిక సంఖ్యలో ఆమోదం తెలుపుతారనే విషయంలో స్పష్టతకు ఈ ఐవిఆర్ విధానంలో ఫోన్ల ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. ఫలానా అభ్యర్థి అయితే ఒకటి, మరొక అభ్యర్థి అయితే రెండు వీరు కాకుంటే నోటాకు ఫలానా నెంబరు నొక్కాలని ఇంటర్ యాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ ద్వారా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సొంత వాయిస్ రికార్డింగ్ ద్వారా ప్రజలకు కాల్స్ అందుతున్నాయి. ఈ విధానంను ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో సైతం అమలు చేస్తున్నారు. కుప్పంలో సైతం తన అభ్యర్థిత్వానికి ఆయన ప్రజలనుంచే ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుండడం విశేషం. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చింది. భారతీయ జనతా పార్టీతో పొత్తు విషయం తేలిన నేపథ్యంలో అటు తెలుగుదేశం పార్టీ, ఇటు జనసేన పార్టీ, భారతీయ జనతాపార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించనున్నాయి. ఈ నేపథ్యంలో తెలుగుదేశం తరపున అభ్యర్థిత్వాలు ఆశిస్తున్న నేతలపై ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉందనే విషయంగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఈ ఐవిఆర్ విధానంలో ప్రజలనుంచి వచ్చే స్పందనను పరిగణనలోకి తీసుకోనున్నట్లు సమాచారం.

**ప్రైవేట్ హాస్పిటల్‌లకు ధీటుగా**

## ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు

**జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీషా**



చిల్లకూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాల్లో భాగంగా కార్పొరేట్ హాస్పిటల్ దీటుగా ప్రభుత్వ వైద్యశాలలో ఆధునాతనమైన పరికరాలతో వైద్య సేవలు అందించడం జరుగుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీ షా అన్నారు. బుధవారం మండలంలోని చింతవరం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆర్డిఓ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఓ ఎం. శ్రీహరితో కలిసి తనిఖీ చేసారు. అనంతరం ఓపి కేంద్రాన్ని పరిశీలించి రోజుకి ఎంత మంది రోగులు వైద్యం చేయించుకుంటున్నారని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ బిపి లెవెల్స్ కరెక్ట్‌గా ఉందా లేదో అని పరీక్షించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు మీ వద్ద ఉన్న మందులు మాత్రమే ఇవ్వాలని బయట నుండి ఎలాంటి మందులు తెచ్చి ఇవ్వరాదని సిబ్బందికి తెలిపారు. అదే విధంగా మందుల స్టాక్ విషయంలో ఎంతవరకు మందులు ఉన్నాయి అని అడిగి తెలుసుకుందామన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల వ్యాధులకు అధునాతమైన పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా చింతవరం ఎంపిటిసి పాలూరు మాధవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి త్రాగునీటి బోరు, సిసి రోడ్డు కాంపౌండ్ వాల్‌తో పాటు ఈ హాస్పిటల్ 24 గంటలు వైద్య సేవలు అందించే హాస్పిటల్ అని రాత్రి సమయంలో ఉండేందుకు ఒక వైద్యుల్ని నియమించాలని అర్జీ రూపంలో కలెక్టర్‌కి ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం చిల్లకూరు గ్రామంలో ఏర్పాటైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం కలెక్టర్ చేయడం జరిగింది. ఆర్డిఓ కిరణ్ కుమార్, డిఎంహెచ్ఓ ఎం శ్రీహరి, డిప్యూటీ డిఎంహెచ్ఓ మస్తానమ్మ, తహశీల్దార్ కె. శ్రీనివాసులు, ఎంపిడిఓ భానుమూర్తి రావు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## పూత రాని మామిడి...



పూత కనిపించని మామిడి తోట

విజయపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :

మామిడిలో ఈ సీజన్‌లో పూత సక్రమంగా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత కోసం ఇప్పటికే ఒక పర్యాయం మందులు పిచికారి చేసినా ఆశించిన స్థాయిలో పూత రాలేదు. దాంతో రెండో సారి మందులు పిచికారి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో మొత్తం 25 పంచాయతీల్లో జగన్నాథపురం, క్షూరికాపురం, విజయపురం, కోసలనగరం, పాతార్కాడు, జంబాడ, మహారాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ, నారపరాజుకండ్రిగ పంచాయతీల్లో ఎక్కువగా మామిడి సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 2200 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. తోతాపురి, బంగినపల్లి, రుమాని, కాలేపాడు, సింధూర వంటి రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. మంచు ఎక్కువగా కురవడం వల్ల పూత తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత రావడానికి ఉద్యానవన శాఖ అధికారులు తగు సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

**ఆందోళనలో రైతులు**



**మంచు వల్ల పూత లేదు...**

**మురళీకృష్ణారెడ్డి, మామిడి రైతు**

మంచు తీవ్రత వల్ల మామిడిలో పూత తగ్గింది. తేలికపాటి పూత వచ్చినా పొగ మంచు వల్ల పేను బంక తెగులు సోకి పూత రాలిపోతుంది. రైతులు ఉద్యానవన శాఖాధికారులు సూచనలు ఇవ్వాలి

**ప్రతి ఏడాది మామిడి రైతులకు కన్నీరే**

**హరికృష్ణ, కోసలనగరం**



మామిడిలో పూత కోసం రెండు పర్యాయాలు మందులు పిచికారి చేశాను, యాభై శాతం మామిడి చెట్లలో పూత సక్రమంగా కనిపించడం లేదు. పిచికారి చేసిన మందులు పని చేయడం లేదా...కొత్త రకం మందులువేయాలా అని అర్థం కావడం లేదు.

## అలరించిన వేంకటేశ్వర నవరత్నమాలిక

**-భగవంతుని కీర్తనలతోనే సత్సంగం**

**-ఆనందతీర్థాచార్యులు**



తిరుమల, ఫిబ్రవరి 7ప్రభాతవార్తప్రతినిధి: కలియుగంలో ప్రజలు కష్టాల నుండి, తాము చేసే పాపాల నుండి విముక్తికి భగవన్నామ నామస్మరణతోనే మోక్షం లభిస్తుందని దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యులు తెలిపారు. పూర్వం ఎందరో మహనీయులు భగవన్నామస్మరణతోనే నేటికీ చిరస్మరణీయుల య్యారన్నారు. పురందరదాసు ఆరాధనమహోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి తిరుమలలోని కల్యాణవేదికలో దాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో 300మంది ప్రముఖ కళాకారులతో శ్రీవేంకటేశ్వర నవరత్నమాలిక గోష్ఠిగానం వైభవంగా నిర్వహించారు. ఈ కీర్తనలతో తిరుమలగిరులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో ద్వారంలక్ష్మీ, తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాల దాససాహిత్య కళాకారులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయానికి 1.21 కోట్లు ఆదాయం
14 కాణిపాకం ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం
4లో

## పంచాయతీ పార్టీ సమావేశాలు జయప్రదం చేయాలి

శాంతిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

గ్రామ వికాస పత్రాల తయారీ కోసం తెదేపా పంచాయతీ పార్టీ సమావేశాలను విజయవంతం చేయాలని మండలటిడిపిఅధ్యక్షుడు విశ్వనాథనాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. బుధవారం మొదలైన ఈనెల 14వతేది వరకు మండలంలోని 23 పంచాయతీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు.

## తెదేపా గాండ్లకులస్తుల సమావేశం జయప్రదం చేయాలి

రామకుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ గాండ్ల కులస్తుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కుప్పం మాజీ ఎంపిపి చౌడప్ప కోరారు. రామకుప ్పంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 11న కుప్పం మున్సి పల్ కమతమూరు దండు మారెమ్మ ఆలయ ఆవరణలో ఈసమావేశం జరుగుతుందన్నారు. గాండ్ల కులస్తుల సమస్యలు, కమ్యూనిటీ భవనం, విద్య, ఉద్యోగావకాశాలు తదితరాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో నేతలు ఉపేం ద్ర, సత్యనారాయణ, సుబ్రమణ్యం, మహ్మద్ రఫీ, మురళి, వెంకటరమణ, వెంకటరామ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ షేక్షావలీ సేవలు ప్రశంసనీయం

ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



ఎస్ఆర్‌పురం మండల ఎస్ఐగా విధుల నిర్వహణలో రాజకీయాలకు అతీతంగా సామాన్యులకు న్యాయం చేసిన షేక్షావలీ సేవలు ప్రసంశనీయమని పలువురు పేర్కొన్నా రు. ఎస్ఐ షేక్షావలీ ఎస్ఆర్ పురం స్టేషన్ నుండి చిత్తూ రు వన్‌టౌన్ స్టేషన్ ఎస్ఐగా బదిలీపై వెళ్ళడంతో బుధవారం ఆయనను నాయకులు, స్టేషన్ సిబ్బంది సన్మానించారు.నాయకులు, స్టేషన్ సిబ్బంది ఆయనను పూలమాల, శాలువతో సన్మానించారు.

## జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలకు గుర్తించిన భూమి సర్వే

- కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల కోసం గుర్తించిన భూమిని సర్వే చేసి సరిహద్దు రాళ్ళను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధ వారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ పుల్లయ్యతో కలిసి జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులు హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పుంగనూరు, వి.కోటలకు సంబంధించి భూమిని త్వరితంగా గుర్తించాలని పలమనేరు ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా ల్యాండ్స్ అండ్ సర్వే అధికారి గౌస్‌భాషా, కమిటీ సభ్యులు సహదేవ, జయరాజ్, సయ్యద్ అక్రమ్, డిఐపిఆర్ఓ బి.పద్మజ, చిత్తూరు తహసిల్దారు శ్రీనివాసరెడ్డి, గుడిపాల తహసిల్దారు విజయలక్ష్మీ, డిప్యూటీ తహసిల్దారు కిరణ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోకనాథం, అశోక్‌కుమార్, పాత్రికేయులు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్‌కు ఆమోదం

చిత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



చిత్తూరు మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోని కూరగాయలమార్కెట్లు, జంతు వధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్‌లకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ వేలం నిర్వహణకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు మున్సి పల్ స్టాడింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మున్సి పల్ కార్యాలయంలో బుధవారం మేయర్ అముద అధ్యక్షతన మున్సి పల్ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, సభ్యులు ఆర్‌జి శ్రీకాంత్, సహదేవన్ తదితరులు ఆమోదించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంఇ గోమతి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎసిపి రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తహసిల్దారుగా విజయలక్ష్మీ బాధ్యతలు స్వీకరణ

గుడిపాల, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



గుడిపాల మండల తహసిల్దారుగా విజయలక్ష్మీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇది వరకు ఇక్కడ తహసిల్దారుగా విధులు నిర్వర్తించిన బాబు రాజేంద్రప్రసాద్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో అనంతపురం రూరల్ మండలం నుండి తహసిల్దారు విజయలక్ష్మీ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆమె బుధవారం తహసిల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు 2024లో జరుగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు.

## కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ సుడిగాలి పర్యటన

కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



కుప్పం మున్సి పల్ ఛైర్మన్ డా॥ సుధీర్ మున్సిపాలిటీ పరిధిలో సుడిగాలి పర్యటన నిర్వహించారు.అర్బన్ కాలనీలో మెప్మా సహకారంతో జిఆర్ పేపర్ ప్లేట్ తయారీ కేంద్రంను ప్రారంభించారు.అలాగే సచివాల యం 3వద్ద మెప్మా అధ్వర్యంలో హ్యాండ్ వాష్ యూనిట్ ప్రారంభించారు. అలాగే 12వవార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం కొత్తపేట హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో మున్సి పల్ వైస్ ఛైర్లన్లు, కౌన్సి లర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో వైకాపా గల్లంతు కావడం తథ్యం - తెదేపా నేతలు

కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



వచ్చే ఎన్నికల్లో అధికార వైకాపా గల్లంతు కావడం తథ్యమని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సి పల్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపి సాంబశివం పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. వైకాపా పాలనలో విసిగివేసారిపోయిన రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అధినేత చంద్రబాబు నాయుడు రా.. కదలిరా సభలకు అశేష జనవాహిని వస్తున్నారన్నారు. వైకాపా అవినీతి, అక్రమాలపై ప్రజలే ఎన్నికల్లో తగు బుద్ధి చెప్పడం ఖాయ మన్నారు. కుప్పంలో ఈసారి చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధిస్తామన్నారు. పార్టీలో చేరాలనుకునే వారికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు.సమావేశంలో నేతలు కాణిపాకం వెంకటేష్, ఈశ్వర్, రామ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నేతలచే అన్నదానం

కుప్పంరూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మహిళా నాయకురాలు కాళియమ్మ జ్ఞాపకార్థం బుధవారం వారి కుటుంబసభ్యుడు ప్రకాష్ అధ్వర్యంలో స్థానిక అన్న క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం జరిపారు. నియోజకవర్గ టిడిపి విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ సహకారంతో సుమారు ఐదువందల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కృష్ణన్, సుధ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురం తహశీల్దారుగా మురళీకృష్ణ బాధ్యతలు

శాంతిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



శాంతిపురం మండల తహశీల్దారుగా మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టారు.ఈయన అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. అనంతరం మండలంలో ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో రీసర్వే, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని విఆర్వోలను ఆదేశించారు. అంతకుముందు తహశీల్దార్‌ను విఆర్వోలు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

## మంచినీటి బిల్లులకై వైకాపా నేతల నిరసన

శాంతిపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన మంచినీటి బిల్లులు మంజూరు చేయాలని శాంతిపురంలో శాంతి పురం, రామకుప్పం, వి.కోట మండలాలకు చెందిన నీటి ని సరఫరా చేసిన వైకాపా నేతలు, కార్యకర్తలు పలు వురు నిరసన తెలిపారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూసినందుకు బిల్లులు మంజూరు చేయడం లేదా అని ప్రశ్నించారు. తమ పరిస్థితి దారుణంగా ఉందని కొందరు ఫైనాన్స్ ఇచ్చిన వారు ట్రాక్టర్లు తీసుకెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్ముందు ఎలాంటి కార్యాచరణ అమలు చేయాల్లో చర్చించారు.

## ఓటరు నమోదుపై అవగాహన

పాలసముద్రం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎపిఎం ఫరీద్ మస్తాన్ పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో బుధవారం ఎపిఎం ఫరీద్ మస్తాన్ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళ సంఘ సభ్యులతో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఫరీద్‌మస్తాన్ మాట్లాడుతూ ఓటు హక్కు అనేది వజ్రాయుధంతో సమానం అని, ప్రజాస్వామ్యయుతంగా నచ్చిన వారికి ఓటు వేసి తమ ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## భక్తుల మనోభావాలకనుగుణంగా నడుచుకోవాలి

ఛేర్మన్ నాగరాజరెడ్డి

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ ఆలయంలో వేలంపాట మదుపుదారులు భక్తుల మనోభావాలకనుగుణంగా నడుచుకోవాలని ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి అన్నారు. బుధవారం కొండపై ఆలయంలోని వివిధ వనరులకు వేలం పాటలు నిర్వహించారు. ఆయన ప్రసంగిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బోయకొండ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. యాత్రీకుల కోరిక మేరకు ఆలయంలోని పలు వనరుల్లో తగ్గింపు చర్యలు తీసుకొన్నామన్నారు. పెద్దభోగము విషయంలో గత సంవత్సరంతో పోల్చితే తల ప్రసాదము రూ. 500లు, 700లుగా, శుభ్రపరచే ప్రక్రియలో రూ. 700ల నుంచి రూ. 400లకు తగ్గించామన్నారు. వేలం పాటదారులకు ఆలయం నుంచి సహాయ సహకాలుంటాయనీ, అదే రీతిలో భక్తులతో స్నేహపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రస్తుతం జరిగిన వేలం పాటల ద్వారా గత సంవత్సరం కంటే ఈ దఫా రూ. 56,38,884లు అధికంగా అమ్మవారికి ఆదాయం సమకూరింది. ఇఓ చంద్రమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు హాజరయ్యారు.

## తవణంపల్లె ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

తవణంపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



తవణంపల్లె ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా తవణంపల్లె ఎంపీడీఓగా పనిచేస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్ నెల్లూరు జిల్లా సీతారా మాపురం మండల ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. దీనితో ఇతర జిల్లాల నుండి బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లను తవణంపల్లె ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

## మౌళిక వసతుల కల్పనకు ముందుంటాం: పెద్దిరెడ్డి

సదుం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



ఎక్కడైనా సరే ప్రభుత్వ పరంగా చేపట్టవలసని మౌళిక వసతుల కల్పనకు తాము ఎప్పుడు ముందుంటాం అని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి అన్నారు. బుధవారం సదుం లోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో సైన్సు ల్యాబ్ నిర్మాణానికి ఆటస్థలాన్ని ఏర్పాటుకు ఆయన ఆధ్వర్యంలోభూమి పూజ చేశారు. ప్రధానమంత్రి స్కూల్‌ఆఫ్ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా సైన్సు ల్యాబ్‌కు రెండు లక్షలు, ఆటస్థలానికి ఒక లక్ష రూపాయలు మంజూరైనాయని చెప్పారు. ప్రిన్సి పాల్ శ్రీనివాసులురెడ్డి,, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన

గుడుపల్లె, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో బాలి కలకు కుప్పం కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధ్వర్యం లో సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బాలికలు తీసుకోవాల్సి న పౌష్టికా హారం, రక్తహీనత, వ్యాధి నిరోధక మందులు తది తరాలపై వివరించారు. బాలికలు క్రమం తప్పక ఆహారంలో కూరగాయలు, ఇతర పోషక పదార్థాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డా॥ శిల్ప, డా॥ మంజునాథ్, ఆస్పత్రి సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రఘువీరాను కలసిన కుప్పం కాంగ్రెస్ నేతలు

కుప్పం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు నీలకంఠాపురం రఘువీరారెడ్డిని కుప్పం కాంగ్రెస్ సీనియర్ నేత రామచంద్రప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీనియర్ నేతలు రంగప్ప గౌడు, కృష్ణమూర్తిలు తెదేపా నుంచి, వైకాపా నుంచి బాబు, మురుగేష్‌లు రఘువీరారెడ్డి సమక్షంలో ఆయా పార్టీలు వీడి కాంగ్రెస్‌లో చేరారు. కుప్పం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో త్వరలోనే పార్టీ శ్రేణుల సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీని బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా రామచంద్రప్ప రఘువీరారెడ్డికి వివరించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైసిపి నుంచి 300 కుటుంబాలు టిడిపిలోకి చేరికలు

గూడూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



గూడూరు పట్టణం రాణిపేట, బొగ్గుల దిబ్బ ప్రాంతాల నుండి పెటేటి శ్రీనివాసులు, ప్రకాష్ ఆధ్వర్యంలో 300 కుటుంబాలను పట్టణ ముఖ్య నాయకుల అధ్యక్షతన మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి పాశం సునీల్ కుమార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సారంగం సుధీర్, పామూరు దుర్గారావు, మైనంపాటి సాంబమ్మ, కుంచాల వెంకయ్య, కొల్లూరి అశోక్ బాబు, చల్లా శ్రీనివాసులు, పామూరు ప్రసాద్, బొమ్మిశెట్టి వినోద్, పోతురాజు సాయి, పేరుబోయిన రమేష్, మునిరత్నం, మల్లి బాబు, సాయి తదితరులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, బిల్లు చెంచురామయ్య, నరసింహులు, వాటంబేటి శివకుమార్, ఇశ్రాయేలు కుమార్, రవీంద్ర రెడ్డి, ఔరంగ భాషా, మహిళలు గుండాల లీలావతి, మట్టం శ్రావణి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు ఇంచార్జ్ ఏపిఎంగా మాధవి

వాకాడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



వాకాడు వైఎస్ఆర్ క్రాంతి పదం ఇంచార్జ్ ఏపిఎంగా మాధవి నియమితులయ్యారు. బుధవారం వాకాడు వైఎస్ఆర్ క్రాంతి పదం గూడూరు ఇన్చార్జి డాక్టర్ చంద్ర బాబు వాకాడు ఏపీఎంగా ఇన్చార్జిగా ఉన్నప్పటికి జిల్లా స్థాయి అధికారులు ఆదేశాల మేరకు వాకాడు ఇంచార్జి ఏపిఎంగా ఆర్డర్ రావడంతో మాధవికి ఇన్చార్జి అప్పగించారు. పీసీలు మురళి, భూదేవి, రమణమ్మ, నారాయణ, వెంకటసుబ్బయ్య, శారద మండలం లోని వివోలు, మాధవ్‌కి అభినందనలు తెలిపారు. గూడూరు ఏరియా కోఆర్డినేటర్ ఇన్చార్జి చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన ప్రకారము ఇప్పటి వరకు ఇన్చార్జి ఏపిఎంగా తాను చూసుకున్నానని, ప్రభుత్వ ఆదేశాల మేరకు మాధవికి అప్పగించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

కోట మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆ మేరకు బుధవారం కోట మండల తహశీల్దార్ నాగరాజరావు వెంకన్నపాలెం, తిమ్మనాయుడుపాలెం, తిన్నెలపూడి, కోట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలనుపరిశీలించారు.ఆయాకేంద్రాల్లోవిద్యుత్‌సౌకర్యం, మంచినీటి వసతి, పాఠశాలలకు ప్రహరీగోడలు తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు ఉన్నారు.

## ఎన్‌బికెఆర్‌లో ఆక్సన్-2024 పోస్టర్ ఆవిష్కరణ

కోట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీ రింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో ఆక్సన్-2024 జాతీయ స్థాయి సాంకేతిక సదస్సును మార్చి న 7న జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజ యకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాలలో ఇందుకు సంబంధించిన ఆక్సన్-2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు ఉత్తమ పరిశోధనలను ఎంపిక చేస్తారని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీసేందు కు ప్రాజెక్టు ఎక్స్‌పో, స్పాట్ ఈవెంట్స్ వంటివి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ హరినాథరెడ్డి, కోఆర్డినేటర్ అబ్రహం, కో-కోఆర్డినేటర్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

## మిరపలో జాగ్రత్తలు అవసరం

యాకసిరి (చిట్టమూరు), ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

రైతులకు తక్కువ సమయంలో అధిక లాభాలను చేకూర్చే మిరప సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి లాభాలు పొందవచ్చని నాయుడుపేట ఉద్యానశాఖ అధికారి శారద తెలియజేశారు. బుధవారం యాకసిరి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న మిరప తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా మిరపలో అధికంగా తామర పురుగును గుర్తించడం జరిగిందని, దీని నివారణకు పిఫ్రోనిల్ ఒక లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. తామర పురుగుకు ప్రధాన కారణమైన నల్లి తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని, దీని నివారణకు పసుపుపచ్చ అట్టలను 25 నుంచి 40 వరకు పొలాల్లో ఉంచుకోవాలని సూచించారు.

## ముస్లింల పక్షపాతి సీఎం జగన్

- మైనారిటీలకు ఏడు అసెంబ్లీ స్థానాలు
- వైసీపీ మైనారిటీ సెల్ నాయకుల వెల్లడి

గూడూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్ష పాతి అని మరోసారి రుజువైందని వైసీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండి మగ్దూమ్ మొహిద్దిన్ అ న్నారు. బుధవారం ఆయన గూడూరులో విలేఖరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలోని ఏడు నియోజకవర్గాలలో ముస్లింలకు వైసీపీ అవకాశం కల్పించడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రంలోని మైనారిటీలో 90 శాతం వైసీపీ వెంటే ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుంటామన్నారు. అలాగే గూడూరు నియోజకవర్గంలోనూ మేరిగ మురళీధర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. వైసీపీ నాయకులు షేక్ కాలేషా, జలీల్‌లు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు సిటీ అభ్యర్థిగా మహమ్మద్ ఖలీల్ అహ్మద్‌ను ప్రకటించడం హర్షణీయమన్నారు.వైసీపీ నాయకులు మగ్దూమ్, అల్తాఫ్, కాలేషా, జలీల్, షబ్బీర్ పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటాం

- గ్రీనరీ పెంపునకు కృషి చేయండి - మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మనం ఆరోగ్యంటా ఉంటామని గూడూరు మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణ ప్రజలు గ్రీనరీ పెంపునకు కృషి చేయాలన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో గ్రీనరీ పెంచి ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని సిబ్బందిని మున్సి పల్ కమిషనర్ ఆదేశించారు. వాటర్ ట్యాంక్‌ను తరచూ శుభ్రపరచాలని సూచించారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. పీఎస్ఆర్ పార్కు వాటర్ ట్యాంక్‌ను బుధవారం ఆయన పరిశీలించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ

ఓజిలి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మండల కేంద్రమైన ఓజిలిలోని మూడు పోలింగ్ కేంద్రాలను బుధవారం సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని పరిశీలించారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండిన యువతీ యువ కులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సదుపాయాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వికలాంగ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడానికి వీలుగా అవసరమైన ర్యాంపు లేకపోతే ర్యాంపులు ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌కు సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్లు ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థు లకు హాజరు, మధ్యాహ్న భోజనం, తాగునీటి వసతి, ఆట స్థలం, మరుగుదొడ్ల నీటి సరఫరాతో ఉన్నా యా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి ఆర్డీఓ భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం ఏజన్సీ మహిళలతో మాట్లాడుతూ పిల్లలకు ప్రేమతో భోజనం అందించాలని సూచించారు. ఓజిలి తహశీల్దార్ నాంచారయ్య, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, వీఆర్ఓ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టిడిపి మండల అధ్యక్షుడికి మాతృవియోగం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వేమసాని బాబునాయుడులకు మాతృవియోగం కలిగింది. దొరవారిసత్రం మండలం శింగనాలత్తూరు గ్రామంలో వేమసాని కృష్ణవేణి (69) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి పరసా వెంకటరత్నం, సూళ్లూరుపేట టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, పలువురు కృష్ణవేణమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. అనంతరం పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా శింగనాలత్తూరుగ్రామానికిచేరుకొనికృష్ణవేణమ్మమృతదేహానికి నివాళి అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## మామిడి పూత తెగుళ్లపై రైతులకు అవగాహన

ఆనంద్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

ఉద్యాన వన సాగులో జిల్లాలోని మామిడి పూత అలస్యం అవుతుందని, దీనికి కారణం పగటి మరియు రాత్రి ఉష్ణోగ్రతల మధ్య తేడా 10,12 డిగ్రీలు కంటే ఎక్కువగా ఉన్నప్పుడు పూత రావడం జరుగుతుందని కానీ ప్రస్తుతం పగటి మరియు రాత్రి ఉష్ణోగ్రతల మధ్య తేడా 10 డిగ్రీల కంటే తక్కువగా ఉండటవల్ల పూత రావడం ఆలస్యం అవుతుందని వెంకటగిరి డివిజన్ ఉద్యాన వన శాఖ అధికారి ఆనంద్ రెడ్డి అన్నారు.బుదవారం మండలంలోని మామిడి తోటలను అయన సందర్శించి రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## వెంకటగిరి ఎమ్మెల్యే టికెట్ బిసిలకు కేటాయించాలి

యాదవ యువత రాష్ట్ర కార్యదర్శి బిల్లు సిసింద్రి యాదవ్

వెంకటగిరిరూరల్ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



వెంకటగిరి నియోజకవర్గంలో బిసి జనాభా ఎక్కువగా వున్నందున తెలుగు దేశం పార్టీ అదిష్ఠానం ఎమ్మెల్యే టికెట్ బిసిలకు కేటాయించాలని యాదవ యువత రాష్ట్ర కార్యదర్శి, (టిఎన్ఎస్ ఎఫ్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లు సిసింద్రి యాదవ్ అన్నారు. బుధవా రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో బిసిలు అత్యధికంగా ఉన్నారని, ఒక్క అవకాశం బిసిలకు ఇవ్వాలని నియోజకవర్గంలోని బిసిలు అందరు కోరుతున్నట్లు తెలిపారు.తెలుగుయువత రాష్ట్ర నాయకులు టివిఆర్,చెంచుయాద్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్ది మళ్లీ అభివృద్ధిపథంలో నడిపించాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం చారిత్రక అవసరమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి పాశం సంధ్యారాణి అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని 3వ వార్డు సాధుపేట సెంటర్‌లో పార్టీ నాయకులు పి.నరసింహనాయుడు, టి.చంద్రమౌళి, యల్లా రమేష్‌నాయుడు, ఎం.మోహన్, పి.శ్రీధర్, వై.రత్నంల ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాల్లో భ్రష్టుపట్టిందని, సంక్షోభంలో కూరుకుపోయాయని అన్నారు. వాటిని మళ్లీ సరిదిద్ది గాడిలో పెట్టాలంటే దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు పులిమి శ్రీనివాసరావు, కొండూరు వెంకటేశ్వర్లురాజు, ఎండి అబ్దుల్ రహీమ్, జనార్ధన్‌రెడ్డి, ఆలి హుస్సేన్, ఔరంగబాషా, మహిళలు గుండాల భారతి, కె.కల్పన, నెలటూరు సుప్రజ, సుధా, లక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావం కలిగిన వ్యక్తి రియాజ్ అహ్మద్

పిఆర్ఈఈ గిరినాథ్

గూడూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త

గూడూరు పంచాయితీరాజ్ డివిజన్ కార్యాలయం నందు అసోసియేషన్ హాలులో రాష్ట్ర పంచాయితీ రాజ్ డిప్లమా ఇంజనీర్ల సంఘ గౌరవ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ జన్మదినం సందర్భంగా పంచాయితీరాజ్ ఇంజనీర్లు, లయన్స్ క్లబ్ సభ్యులు ఆద్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. పంచాయితీ రాజ్ పిఆర్ఈఈ గిరినాధ్ మాట్లాడుతూ రియాజ్ అహ్మద్ అందరికి సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు విస్తృతపరచడానికి తమ వంతు కృషి ఎప్పుడు ఉంటుందని మనిషికి సేవ అనేది తృప్తిని కలిగిస్తుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నందు బాలింతలకు, రోగులకు బ్రెడ్, పాలు, పండ్లు అందజేసారు. గూడూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు రవిచంద్ర సెక్రటరీ శివయ్య, ట్రెజరర్ వీరేంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గిరినాధ్, నెల్లూరు ఈఈ శ్రీనివాసులు రెడ్డి, డిఈఈలు రవీంద్రకుమార్, కృష్ణబాబు, రామచంద్రయ్య, చైతన్య కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు దయాల్, ముని కుమార్, ఇలియాస్ అహ్మద్, క్లబ్ సభ్యులు రామ్మోహన్, మదనమేటి రమణయ్య, జక్కంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సీనయ్య, డాక్టర్ చంద్రహాస్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు.

## టిడిపి టికెట్ బీసీలకు ఇవ్వాలి

బిసి నేతలు

బాలాయపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



వెంకటగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టికెట్‌ను బీసీలకు కేటాయించాలని జిల్లా బీసీ సంఘం నాయకులు కోరారు. బాలాయపల్లి మండల కేంద్రంలో బిసి నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వెంకటగిరి నియోజకవర్గానికి బీసీలలో ఎంతో ప్రాధాన్యత ఉన్నా కొత్తగా ఒక్కసారి కూడా బీసీ అభ్యర్థి ఎమ్మెల్యే అవలేదు. కొత్తగా ఏర్పడ్డ తిరుపతి జిల్లాలో అయినా బీసీలకు అవకాశం ఇస్తారని ఆశపడ్డామని ఎవరికి ఇవ్వలేదని నాయకులు తెలిపారు. ఇప్పటికీ అవకాశం ఉన్నందున జిల్లాకి ఒక స్థానమైనా బీసీలకు కేటాయించాలని బీసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు మనవరపు వెంకటరత్నం, మారెళ్ళ వెంకటాద్రి, గెరిటి చెంచయ్య యాదవ్, చెంచుకృష్ణయ్య, సత్తల గిరి ప్రసాద్, పొట్టా పెంచలయ్య, బోలి గర్ల పెంచలయ్య, నల్లిబోయిన శ్రీనివాసులు, ఇంకా మరికొందరు బిసి నాయకులు పాల్గొన్నారు.

## కంచనపల్లి గ్రామంలోని రోడ్లుకు మరమ్మతులు చేయరా సారూ..

తొట్టంబేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



మిచెంగ్ తుఫాను కారణంగా మండలంలోని కంచన పల్లెకు వెళ్ళే రోడ్డు కోసుకుపోవడంతో దెబ్బతింది. ప్రతిరోజు ఈమార్గంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భరత్‌రెడ్డి అధికారులను కోరారు. గతంలో సమస్యను మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, బదిలీ అయిన ఎంపిడివో సురేష్‌బాబుల దృష్టికి తీసుకెళ్ళారు. అయితే అధికారులు స్పందించడంలో విఫలమవుతున్నారని భరత్‌రెడ్డి ఆవేదనవ వ్యక్తం చేశారు. గ్రామాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయని అయితే కంచపల్లె రోడ్డును తాత్కాలిక మరమ్మత్తులు చేయడమేకాకుండా మండలంలో ఇంకా గుంతలమయంగా మారిన రోడ్లను మరమ్మత్తులు చేయాలని కోరారు. చిట్టత్తూరు, కొత్తకండ్రిగ, కొన్నలి, మండల కేంద్రానికి సమీపంలో ఉన్న బంగారమ్మ కాలనీ వద్ద ప్రధాన రోడ్లను మరమ్మత్తులు చేయాలని కోరారు.

## గుడ్‌టచ్..బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తేజో భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యురాలు జివి.బావలహరి విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై ఎల్‌ఈడి స్క్రీన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అసంఘటిత చర్యలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థినులపై జరుగుతున్న అసంఘటిత చర్యలు మరియు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి చక్కగా వివరించారు. విద్యార్థినులు తమ ఆత్మరక్షణకై కరాటే వంటి విద్యను అలవరచుకోవాలన్నారు. తమకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించిన తేజోభారత్ ఫౌండేషన్ సభ్యులకు విద్యార్థినులు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రగతి సంస్థచే పాఠశాలల్లో కళాజాత కార్యక్రమాలు

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని రామానుజపల్లి, పాపన పల్లి పాఠశాలల్లో బుధవారం ప్రగతి సంస్థ ద్వారా అంగన్‌వాడి సేవలపై కళాజాత ప్రగతి సంస్థ పూర్వ ప్రాథమిక విద్యపై నాగేశ్వరరావు కళాబృందచే పలు సామాజిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు పాటలు, నాటికల ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయు భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గర్భిణీ స్త్రీలకు బబాలింతలకు 6 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు అంగన్‌వాడి సెంటర్లలో అందించే సదుపాయాలపై అవగాహన కల్పించారు. అలాగే పోషకాహారం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా రామచంద్ర, ప్రభాకర్‌లుమాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలోని పలు అంగన్‌వాడిల్లో మౌళిక వసతుల కల్పనలో భాగంగాఆటవస్తువులు, కుర్చీలు, బల్లలు, గ్లాసులు, ప్లేట్లు, వైట్ బోర్డులను అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో యస్‌సివి లీడర్లు రత్నయ్య, కలివేలయ్య, చిన్నయ్య, సుబ్రమణ్యం, రవి, వెంకటేష్, అంగన్‌వాడిలు మాధవి, శారద, జ్యోతి సచివాలయ సిబ్బంది చెంచులక్ష్మి, ప్రసాద్, జయచంద్ర, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల వాడకంపై విద్యార్థులకు అవగాహన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నేషనల్ స్కిల్స్ క్వాలిఫ కేషన్స్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా పరిశ్రమల పరిశీలనవల్ల విద్యార్థుల్లో వాహనాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు పట్టణంలోని టివిఎస్‌ద్విచక్రవాహనం షోరూం నందు నైపుణ్యం కలిగిన మెకానిక్స్‌చే ద్విచక్రవాహనాల వాడకం, చిన్నపాటి రిపేర్లపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉన్నత విద్యలైన ఐటి, ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ వంటి విద్యాబోధన చేసేటపుడు డెమోగా మార్కెట్‌కు రవాణా చేయడానికి మరియు అనుకూలమైన సమయంలో వారి సామర్థ్యాలను మరింత అప్‌గ్రేడ్ చేయడానికి అదనపు నైపుణ్యాలను సంపాదించడానికి తిరిగి రావడానికి వీలు కల్పిస్తుందన్నారు.

## డా.బిఆర్.అంబేద్కర్ గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుపబడుతున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆంగ్లమాధ్యమంలో 5 మరియు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థినీ విద్యార్థులు శ్రీకాళహస్తి పట్టణంలోని కాసాగార్డెన్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.ప్రభావతి తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష ఇంటర్ విద్యార్థులకు మార్చి 10వ తేదీన ఉదయం 10 నుంచి 12గంటల వరకు , 5వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల నుంచి ఇంటర్‌మీడియట్ జరుతుందన్నారు.

## సర్పంచ్‌లకు సర్వాధికారాలు: గ్రామాల అభివృద్ధియే లక్ష్యం

దేశం ప్రచారంలో రిషిత

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వాని ఏర్పాటు చేయటం తథ్యమని అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ప్రాధాన్యత సర్పంచ్‌లకు సర్వాధికారాలు, గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా ఉమ్మడి మెనిఫెస్టోలో చంద్రబాబునాయుడు పొందుపరచారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నపుడు గ్రామీణ ప్రజా ప్రతినిధులకు సర్వాధికారాలు ఉండేవని గ్రామీణాభివృద్ధియే లక్ష్యంగా పని చేసేవారని వివరించారు. గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సమయంలో అన్ని పార్టీలను కూర్చొబెట్టి అందరిని సర్దిచెప్పి ఏక గ్రీవం చేసే వారని కానీఈ సారి ఎన్నికల్లో ఏకపక్షంగా సర్పంచ్ పదవులను అమ్ముకున్నారని శివమెత్తారు. ఈ కార్యక్రమాల్లో కార్యక్రమంలో మండల అధ్యక్షులు కామేష్‌యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జి రంగినేని చెంచయ్యనాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జి రవీంద్రనాధ్, వెంకటరమణ, మణి, యాదవ్, హరి, రాజ, తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాదారులు ఈనెల 29లోపు లైసెన్స్ పొందాలి

-ఉప కార్మిక కమిషనర్ బాలు నాయక్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి07 ప్రభాతవార్త:



దుకాణ వ్యాపారస్తులు ఈనెల 29లోపు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని ఉపప కార్మిక కమిషనర్ యం.బాలు నాయక్ ఆదేశించారు. బుధవారం ఉప కార్మిక శాఖ కార్యాలయ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర వర్తక వాణిజ్య సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో దుకాణాదారులు మీ సేవ కేంద్రాలు, గ్రామ వార్డు సచివాలయాల్లో తగిన పత్రాలు సమర్పించి రిజిస్ట్రేషన్‌తో పాటు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య తదితరులు పాల్గన్నారురు.

## నష్టాల ఊబిలో టౌన్ బ్యాంక్

తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపణలు

తిరుపతి టౌన్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త



తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు గత ఎలక్షన్‌లో దొంగ ఓట్లతో వైసిపి పాలకులు చేజిక్కించుకుని బ్యాంకును ఇష్టారాజ్యంగా నడుపుతూ నష్టాలు ఊబిలోకి తెచ్చారని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆరోపించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం మీడియా ముందు తెలుగుదేశం నాయకులు మునిశేఖర్, కంకణాల రజనీకాంత్, సుధాకర్ రెడ్డి, మహేష్, రామ్మూర్తి తదితరులతో కలిసి సుగుణమ్మ మాట్లాడుతూ టిటిడి పది కోట్ల రూపాయిల ధనాన్ని ఈ టౌన్ బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే ఆ సొమ్ముతో టిడి బాండ్లను 7.5 శాతం వడ్డీకి కొనుగోలు చేసి టిటిడికి 8.5 శాతం వడ్డీ చెల్లిస్తూ నెలకు 45 లక్షల వరకు బ్యాంకు నష్టపోయేలా పిచ్చి తుగ్లక్ పాలనను కొనసాగిస్తున్నదన్నారు. ఈ బ్యాంకు ఖాతాదారులు పాలకుల పాలనకు భయపడి, వారి కోట్ల రూపాయిలడిపాజిట్లు తిరిగి వెనక్కి తీసుకున్నారని, నేడు బ్యాంక్ నష్టాల ఊబిలో ఉందని విమర్శించారు.

## పేదల భవిష్యత్ మారాలంటే మరోసారి వైసిపికి ఓట్లు వేయండి

ఏర్పేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త;



పేదల భవిష్యత్ మారాలంటే మరోసారి వైసిపికి ఓట్లు వేసి గెలిపించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యేబియ్యపు మధుసూదన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్ర రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సార్వత్రిక ఎన్నిక లలో భాగంగా బుదవారం మండలంలోని కుక్కల గుంట గ్రామంలో అమె ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదింటి భవిష్యత్‌ను గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ని మరోసారి గెలిపించేందుకు ఏర్పేడుమండలంసిద్ధంగాఉందనిఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఏర్పేడు మండల ఇన్‌చార్జీ కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్, సింగల్‌విండో ఛైర్మెన్ జనార్ధన్ యాదవ్, కోఆప్షన్ మెంబర్‌బత్తిశెట్టి, సర్పంచికృష్ణయ్య, మధు, వెంకటేష్, లక్ష్మయ్య, సుబ్రమణ్యం, సాంబయ్య, వెంకటకృష్ణయ్య, రామ్‌బత్తెయ్య యాదవ్, మోహనప్రియ, సురేఖ, గుణనాయుడు, మస్తాన్, సుధీర్, గురునాధ్, రామాచారి, కరీముల్లా, ఈశ్వర్, వెంకటేష్, దామోదర్‌రెడ్డి, మణి, రమేష్ మండల నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తరలింపులపై మైన్స్‌అధికారులు దాడులు

-మూడు టిప్పర్లు సీజ్

సత్యవేడు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:

సత్యవేడు మేజర్ పంచాయితీలో గత కొంతకాలంగా సాగుతున్న తెలుగు గంగా కాలువ మట్టి తరలింపులపై మైన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలను పట్టుకుని సీజ్ చేశారు. రాత్రి సమయాల్లో పోలీసులు బీట్ చెకింగ్‌లు నిర్వహిస్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఇక్కడ మట్టి తరలింపులు లాభసాటి వ్యాపారం సాగిపోతున్నది. స్థానికులు ఈ తరలింపులు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మైన్స్ అధికారులు దాడులు నిర్వహించి అక్రమ మట్టి తరలింపులకు అడ్డుకట్ట వేశారు. మట్టిని తరలిస్తూ పట్టుబడిన టిప్పర్‌లారీలపై చట్టపరమైన చర్యలు చేపడతామని మైన్స్ అధికారులు పేర్కొన్నారు.

## రాష్ట్ర రాజధానిగా తిరుపతిని ఏర్పాటు చేయాలి

-మాజీ ఎంపీ చింతా మోహన్



సత్యవేడు, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి తిరుపతిని ఏర్పాటు చేయడమే అన్నిటికి అమోదయోగ్యంగా ఉంటుందని మాజీ ఎంపి, కాంగ్రెస్ నేత చింతామోహన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో భాగంగా సత్యవేడు పంచాయితీలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం నుండి ఆంధ్రరాష్ట్రం వేరుపడినప్పుడు మొదట తిరుపతి రాజధాని గా అనుకున్నారని కానీ హైదరాబాద్‌ను రాజధానిగా చేశారన్నారు. అయితే తిరుపతిని రాజధాని గా చేయడం వల్ల రాయలసీమ, కోనసీమ, ఉత్తరాంధ్ర, పల్నాడుతో సహా అన్ని ప్రాంతాలు వారికి మంచిదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తిరుపతిని రాజధానిగా చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు పురుషోత్తం, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులు ఉచిత వైద్య పరీక్షలు

పుత్తూరు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో ఆటో కార్మికులు, ఆర్టీసి డ్రైవర్లకు రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు కూడా నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆటో కార్మికులు, ఆర్టీసి డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా కంటికి సంబంధించి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసి డిపో మేనేజర్ ఎం.ఎస్.ప్రశాంతి, ఎఎంఎఫ్ ఎ.జ్యోతి రెడ్డి, గుడ్ షెప్పర్డ్ ఆస్పత్రి డైరక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ అనిత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య దర్శన భాగ్యం కల్పించండి

ఆర్‌టిసి ఉద్యోగుల వినతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరుని దర్శన భాగ్యం కల్పించాలని బుధవారం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. తిరుపతి పరిసరాల్లో డిపోల్లో పని చేస్తున్న ఉద్యోగులకు డ్రైవర్లు, కండక్టర్లకు దేవస్థానం ప్రత్యేక ఐడి కార్డులను జారి చేసి వైకుంఠనాధుని ప్రత్యేక దర్శన భాగ్యం కల్పిస్తున్నారని తమకు కూడా అలాగే ఐడి కార్డులు జారి చేసి శివయ్య ప్రత్యేక దర్శనం భాగ్యం కల్పించాలని కోరారు. వారి విన్నపాన్ని ఆలయాధికారులకు అందిస్తూ మన ప్రాంతంలో పని చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగుల అభ్యర్థన మేరకు ప్రత్యేక ఐడి కార్డులు అందించాలని కోరారు. ఈ మేరకు ఆర్‌టిసికి చెందిన యూనియన్ నాయకులు పిఎస్‌కుమార్, జిపిఎస్ ఆచారి, మాధవాచారి, బియస్‌ఆర్ కుమార్, ప్రసాద్, కేసిరెడ్డి, నరసింహులు, సునీల్ కుమార్, ఆశోక్‌కుమార్, ఉదయ్, వెంకట్రాద్రి, కిషోర్, లింగమూర్తి, షణ్ముగం, గురునాధం తదితరులు పాల్గొన్నారు.

## కాపు సంఘ జిల్లా నాయకునికి సన్మానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



తిరుపతిజిల్లా కాపు సంక్షేమ అధ్యక్షులు హేమంత్ రాయల్‌ను బుధవారం శ్రీకాలహస్తి కాపుయువసేన నాయకులు దుశ్శాలువతో సత్కరించారు. కాపుసంక్షేమ సేన శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ను నియమించినందుకు ఆయన్ను సత్కరించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అరిగెల వేణుతో కలసి పని చేసి తమ సంఘం ప్రతిభాపాటవాలను చాటి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యుడు బత్తిన మధుబాబు, ఆరిగెల వేణుగోపాల్ ఉన్నారు.

## 15లోపు సాంస్కృతిక కార్యక్రమాలకు దరఖాస్తులు పంపాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వచ్చేనెల 3నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో సాంస్కతతిక వేదికపై అవకాశం కోరే కళాకారులు తమ దరఖాస్తులను ఈ నెల 15లోపల దేవస్థానం ఇఓకు చేరేటట్లు పంపాలని బుధవారం దేవస్థానం ఓ ప్రకటనలో తెలిపారు. 13రోజుల పాటు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో కేవలం 120 కార్యక్రమాలకు మాత్రమే అవకాశం కల్పించగలమన్నారు. కాబట్టి కళాకారులు తాము ప్రదర్శించే అంశానికి సంబందించి పొందుపరచిన దరఖాస్తులను దేవస్థానంకు అందించాలని కోరారు.

## జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు పథకాల ద్వారా లబ్ది

తొట్టంబేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



ప్రతి గడపలో అదే అభిమానం, అదే ఆప్యాయత జగనన్న ప్రభుత్వంలో తమకు అన్ని రకాలుగా లబ్దికలిగింది. మరోసారి మధన్నను ఎంఎల్‌ఏగా చేయడానికి తాము సిద్దంగా ఉన్నామని లబ్దిదారులు ఎంఎల్ఏ సతీమణి బియ్యపుశ్రీవాణికి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని పెద్దకనపర్తి పంచాయతీ, హరిజనవాడ, చిన్న కనపర్తి, హరిజనవాడ, మల్లేశ్వరపురం గ్రామాల్లో ప్రతి గడపలో జగనన్న ప్రజాసేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో ఎవరు అందుబాటులో ఉన్నారో, ప్రజలకు అను నిత్యం సహకరిస్తున్నారో తెలుసుకోవాలని ప్రజలకు తెలిపారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని తెలుసుకుని నాలుగేళ్ళుగా కనిపించకుండా పోయిన వారందరు నేడు ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడగడం ఎంత వరకు సమంజసమో వారే ఆలోచించుకోవాలన్నారు. ముందుగా బియ్యపుశ్రీవాణిరెడ్డికి తొట్టంబేడు మండల వైకాపా సీనియర్‌నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నంనిర్మల, పిఎసిఎస్ ఛైర్మన్ మణిబాబునాయుడులు ఆమెను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌విమల, వీరాస్వామి, ప్రసాద్, నాగరాజు, చంద్రయ్యనాయుడు, కొన్నలిరమేష్, గిరిరెడ్డి, మోహన్, రవీంద్రనాయుడులతో పాటు పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

-కార్పొరేట్ తరహాలో వైద్యం

తొట్టంబేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కు విశేష స్పందన లభిస్తుంది. చోడవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు మరియు చికిత్స అలాగే జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో వృద్దులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు రాయడం జరిగింది. అంతేకాకుండా గర్భిణీస్త్రీలకు పరీక్షలు జరిపి వారికి ఆహారపు అలావాట్లు, తగిన చికిత్స ఆస్పత్రిలోనే కాన్పు చేసుకోవడం వంటి సలహాలు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, వారికి పరీక్షలు జరిపిఅవసరమైన ఉచిత మందులను అందించారు. కార్యక్రమంలో కాసరం వైద్యాదికారులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ యాదవుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిత, డాక్టర్‌ప్రవీణ్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## మండలంలో విస్తృతంగా బిజెపి ప్రచారం

-కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

.తొట్టంబేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త



గడపగడపకు ప్రధాని నరేంద్రమోడీ సంక్షేమ పథకాలు, వాటికి సంబందించిన కరపత్రాలను మండల పార్టీ అధ్యక్షుడు వేదాం కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరి ఆదేశాలతో రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ సూచనలతో మండలంలోని కల్లిపూడి, తాటిపర్తి, మల్లిగుంట గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు, బిజెపి నేత నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడి పథకాలు పేదలు, రైతులు, మహిళలు, యువత అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అవి అమలు జరుగుతున్నాయా?లేదా అని వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు పెట్టి ప్రజలకు వివరించామన్నారు. నియోజకవర్గంలో ఒక్కసారి కోలా.ఆనంద్ కుమార్‌కు అవకాశం ఇచ్చి కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబిసి మోర్చా కార్యదర్శి పెద్దపాలెం రవి ఆచారి, పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ముద్దుకృష్ణమ సేవలు చిరస్మరణీయం



వడమాలపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

ఎమ్మెల్యేగా, మంత్రిగా గాలి ముద్దుకృష్ణమనాయుడు సేవలు చిరస్మరణీయమని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. ముద్దుకృష్ణమ వర్ధంతి సందర్భంగా బుధవారం వడమాలపేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ముద్దన్న అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చినబాబు, ధనంజయనాయుడు, భాస్కర్‌నాయుడు, వెంకటయ్య, హేమావతి, ధనలక్ష్మి, శేషాద్రియాదవ్, పెద్దబ్బరాజు, రవిరెడ్డి, బాలకృష్ణ, మునిరత్నం, దాము యాదవ్, బత్తెయ్య, శివరాయల్, హేమాద్రి నాయుడు, వెంకటేశ్వరరావు, రఘు, మోహన్, దేవా, శోభనాద్రి యాదవ్, శ్రీనివాసులు, చైతన్య, వినోద్ పాల్గొన్నారు.

## మామిడి పంట సాగులో మెళకువలపై అవగాహన

వడమాలపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



మామిడి పంట దిగుబడికి రైతులు పాటించాల్సిన మెళుకువలపై ఉద్యానవన అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని శ్రీ బొమ్మరాజుపురం గ్రామంలో పుత్తూరు ఉద్యానవన శాఖ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. పూతలు ఆలస్యం అవుతున్నందున రైతులు ఏఏ మందులు వాడాలి, పూత, పిందె, దశలో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించారు. అలాగే మామిడి పంటకు ఆశించే చీడ పీడలు, తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఉద్యానవనశాఖ అధికారి సౌజన్య, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో సంక్షేమ పండుగలు

గడపగడపలో హర్షిత్ రెడ్డికి ఘన స్వాగతం



చంద్రగిరి, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనా కాలాన్ని సంక్షేమ పండుగలుగా ప్రజలు భావిస్తున్నారని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. ఏ.రంగంపేటలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలోనూ ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్దిదారులను ఎంపిక చేసి కనీసం ఒక కుటుంబానికి 5 సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి వారసుడిగా మీ ముందుకు వస్తున్న 2024 ఎంఎల్ఏ అభ్యర్థి తుడా ఛైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు.

## వడమాలపేట ఎంపీడీవోగా సుజాతమ్మ

వడమాలపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



వడమాలపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుజాతమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా అత్తులూరు మండలంలో పని చేసిన ఆమె బదిలీపై వడమాలపేటకు వచ్చారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన సుజాతమ్మను ఏవో శేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది అభినందించి, సన్మానించారు. ఈవోపీఆర్‌డీ మాధురి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

## రేణిగుంట వాసికి నెహ్రూ యువ కేంద్రంలో కీలక పదవి

రేణిగుంట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



రేణిగుంటకు చెందిన డాక్టర్ మార్గాని సోమశేఖర్ నెహ్రూ యువజన కేంద్రం సంఘటన్ తిరుపతి జిల్లా సెలెక్షన్ కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న నెహ్రూ యువ కేంద్ర జిల్లా సెలెక్షన్ కమిటీ సభ్యులుగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతం క్రీడాకారులను ప్రోత్సహించి క్రీడల్లో వారికి నైపుణ్యాన్ని కలిగించి, స్వయం ఉపాధి కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి అందేలా తనవంతు కృషి చేస్తానన్నారు. కీలక పదవి అందుకున్న డాక్టర్ సోమశేఖర్‌ను పలువురు అభినందించారు.

## టౌన్ సర్వీస్‌లను మరల ప్రారంభించండి - బీజేపీ డిమాండ్

రేణిగుంట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



రేణిగుంట-చంద్రగిరి మధ్య టౌన్ సర్వీసులను తిరిగి ప్రారంభించాలని బీజేపీ పార్టీ డిమాండ్ చేస్తూ రేణిగుంట పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల పార్టీ అధ్యక్షురాలు తేజోవతి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ మాట్లాడుతూ తిరుపతి, చంద్రగిరి మధ్య టౌన్ సర్వీసులు నిలిపి వేయడం వల్ల విద్యార్థులు, వ్యాపారస్తులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా స్విమ్స్, రుయా ఆస్పత్రులకు వెళ్ళడానికి రోగులు పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదన్నారు. పుత్తూరు మార్గంలోనే వెళ్లే సత్యవేడు, పుత్తూరు బస్సులను రేణిగుంట మీదుగా నడపాలన్నారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లను మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల ఇన్‌చార్జి లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి పూజారి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, తండ్లం వెంకట రమణారెడ్డి, బీజేపీ సీనియర్ నేతలు జీ పాళెం కృష్ణారెడ్డి, యతేంద్ర, గేహ్లోత్, రాజా రాయల్, మునస్వామిరెడ్డి, శ్యామ్, రాఘవులు, యువ మోర్చా వేణు, రవి, అశోక్, చందర్ రాయలు, కొండ కిషోర్, మురళి, ఓదార్పు సంఘం ప్రధాన కార్యదర్శి పూమణి తదితరులు తిరుపతి ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

## వైసిపితోనే రాష్ట్ర ప్రగతి



తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

వైసిపితోనే రాష్ట్రం ప్రగతి పథంలో నడవగలదని తుడా ఛైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. బుధవారం రామాపురం, నెన్నూరు, నడవలూరు, సొరకాయలపాళ్యం, గంగిరెడ్డిపల్లి సచివాలయాల పరిధిలో వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు నూతన భవనాలను, ఆర్వో ప్లాంట్లను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కొనసాగాలంటే మరొకసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలలో తనను ఆశీర్వదించి ఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు. ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సిద్ధముని రెడ్డి, ఎంపిటిసిలు రాజేష్, చంద్రశేఖర్ రెడ్డి, మంజుల సిద్దారెడ్డి, తిరుచానూరు మార్కెంటింగ్ వైస్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా నాయకుడు “ముద్దు”

టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి



రామచంద్రాపురం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:

ప్రజా నాయకుడు దివంగత మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు అని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. ముద్దుకృష్ణమ నాయుడు 6వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం వెంకట్రామాపురంలోని స్మృతి వనంలో ఆయన సమాధిపై పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవకే అంకితమైన మహనీయుడని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్రమణ్యం యాదవ్, చంద్రబబాబు యాదవ్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముద్దుకృష్ణమనాయుడు వర్ధంతి వేడుకలు

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:



దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రామచంద్రాపురం మండలం వెంకటాపురంలో ఆయన సమాధి వద్ద గాలి జగదీష్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఆయన అభిమానులు శివశంకర్‌నాయుడు, గిరి, శివ, ఆలం సాయి, కిరణ్, హరీష్ చౌదరి, కర్ణాకర్ చౌదరి తదితరులు ఉన్నారు.

## రేపు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

తొట్టంబేడు, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త

రేపు మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి అందరు మండల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు హజరవ్వాలని కోరారు.

